క్లుప్తంగా

మోదీ, అర్వింద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్: ప్రధాని నరేంద్రమోదీ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కిసాన్ సమ్మాన్ యోజన కింద ఏడాదికి రూ.10 వేలకు పెంచుతూ జీవో విడుదల చేయడం పట్ల మండలంలోని మైతాపూర్, రామాజీపేట గ్రామాల్లో శనివారం బీజేపీ నాయకులు ప్రధాని మోదీ, ఎంపీ ధర్మపురి అర్వింద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మోత్కూరి శ్రీనివాస్, శివనీతి కిష్టయ్య, జగదీశ్వర్, పాలడుగు లింగారెడ్డి, చిన్న కిష్టయ్య, రామాజీపేటలో కోల శంకర్, నాగరాజు, నరేందర్, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయురాలికి సావిత్రీ బాయి పూలే అవార్డు



అవార్డును అందుకుంటున్న విజయలక్ష్మి

ధర్మపురి: విద్య, సామాజిక రంగంలో విశేష సేవలందించినందుకు ధర్మపురికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలు రాపర్తి విజయలక్ష్మి సావిత్రీ బాయి పూలే పురస్కారం అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

ఆరెపల్లి ఉపాధ్యాయురాలికి..



అవార్డుతో శ్రావణి

జగిత్యాల: కొడిమ్యాల మండలం ఆరెపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మారంపల్లి శ్రావణి సావిత్రీబాయి పూలే పురస్కారం లభించింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రభుత్వం నిర్వహించిన వేడుకల్లో శ్రావణిని మంత్రి సీతక్క పురస్కారాన్ని అందించి సన్మానించారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించాలి



ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తున్న నాయకులు

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి వెళ్లి వివరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మండల ఇంచార్జీ వడ్డెపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని రాఘవపేటలో మున్నూరు కాపు రైతుమిత్ర సంఘం భవన నిర్మాణానికి మంజూరైన ఎంపీ ల్యాండ్ నిధులు రూ.3 లక్షల ప్రొసీడింగ్ పత్రాలను బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు దేశెట్టి భూమేశ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బైన ప్రశాంత్, బూత్ అధ్యక్షులు , మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు చిట్యాల రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

'ఆంక్షలు లేకుండా రైతు భరోసా ఇవ్వాలి'

కథలాపూర్: రైతులకు పంటల పెట్టుబడి కోసం ప్రభుత్వం అందించే రైతు భరోసా నిధులు ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇవ్వాలని రైతు ఐక్యవేదిక జిల్లా నాయకులు బద్దం మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. కథలాపూర్‌లో రైతు ఐక్యవేదిక నాయకులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పంట రుణమాఫీ చేయలేదని, ధాన్యానికి బోనస్ ఇవ్వకుండా చేతులెత్తిసిందని మండిపడ్డారు. రైతు భరోసా కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పి రైతులను గందరగోళానికి గురిచేయవద్దన్నారు.సమావేశంలో నాయకులు ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం శేఖర్‌రెడ్డి, అంజి రెడ్డి, జవిడి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాలరూరల్: మండలంలోని కండ్లపల్లి మోడల్‌స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సరితదేవి తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10 తరగతుల్లో మిగిలిన సీట్ల ప్రవేశం పొందేందుకు ఈనెల 6 నుంచి ఫిబ్రవరి 26 వరకు www. telangnams.cgg.gov.in వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 3న హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

మిరపకు అంతుచిక్కని రోగం

- చేతికందే దశలో కుళ్లిపోతున్నాయని రైతుల ఆవేదన
- ఆర్థికంగా నష్టపోతున్న వైనం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



కథలాపూర్ మండలంలో సాగుచేసిన మిర్చి పంట   కుళ్లిపోయిన మిరపకాయలు(ఇన్‌సెట్‌లో)

కథలాపూర్: ఆరుగాలం శ్రమించి మిర్చి సాగు చేయగా.. మిరపకాయలు ఎదిగి చేతికందే సమయంలో కుళ్లిపోవడంతో రైతులు వాపోతున్నారు. అష్టకష్టాలు పడి పంటలను కాపాడుకున్నామని, తీరా మిరపకాయలుగా ఎదిగే సమయంలో కుళ్లిపోవడంతో తమకు ఆర్థికంగా నష్టపోతున్నామని మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు.

6 నెలల శ్రమ వృథా

మండల వ్యాప్తంగా సుమారు 500 ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేసినట్లు అధికారుల అంచనా. తక్కువ నీటితో మిర్చి పంటను సాగు చేయవచ్చని రైతులు భావించారు. సుమారు 6 నెలలు కష్టపడి మిర్చి పంటను కాపాడుకున్నామని, తీరా మిరపకాయలు చేతికందే సమయంలో కుళ్లిపోవడంతో ఏమి చేయాలో తోచడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరపతోటలో ఆకు ముడత, వేరుకుళ్లు వస్తే మందులు పిచికారి చేస్తే మార్పులు వచ్చాయన్నారు. చేతికందే మిరపకాయలు కుళ్లిపోతే 6 నెలలు పడిన శ్రమ వృథా అయిందని రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. మిర్చి సాగు చేస్తే పంటకు రోగాలు వచ్చి పెట్టుబడి మీద పడిందని, అధికారులు పరిశీలించి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మిర్చి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చలి ప్రభావంతో నష్టం



చలి ప్రభావం ఎక్కువగా ఉండటంతో మిరపతోటలకు కాస్తా నష్టం జరిగింది. మిర్చి పంటలో తడి పూర్తిగా ఆరిన తర్వాత మళ్లీ నీరు అందించాలి. లీటర్ నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ వేర్లకు అందించాలి. పెగాసిస్‌ను పంటకు పిచికారీ చేయాలి.

– శ్యాంప్రసాద్, ఉద్యానవనశాఖ టెక్నికల్ అధికారి, జగిత్యాల

'అమృత్' తో ఇంటింటికీ తాగునీరు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: జగిత్యాల అన్ని వైపుల రహదారుల అభివృద్ధితో పాటు, అమృత్ పథకం కింద ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో సీసీరోడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జగిత్యాలలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టామని, పట్టణాభివృద్ధికి రూ.100 కోట్లతో ప్రతిపాదనలు పంపించగా సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. కండ్లపల్లి చెరువు కలుషితం కాకుండా రూ.2.60 కోట్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, గంగమల్లు, దయాల శంకర్, బాలె శంకర్, వేణు, లత పాల్గొన్నారు.

అంధుల పాలిట గొప్ప వరం బ్రెయిలీ లిపి

లూయిస్ బ్రెయిలీ లిపి అంధుల పాలిట గొప్ప వరమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీచర్స్‌భవన్‌లో లుయిస్ బ్రెయిలీ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో నరేశ్, ఈఈ ఖాన్, డీఈ వాజిద్, సీడీపీవో మమత పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగుల డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో పెన్షనర్లు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

'తపస్' క్యాలెండర్ ఆవిష్కరణ



తపస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శనివారం ఇందిరాభవన్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తానెప్పుడు ఉపాధ్యాయుల పక్షపాతినని. ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సలహాలిస్తూ సమస్యల పరిష్కారంలో ముందున్నానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండ శంకర్, తపస్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, ప్రసాద్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భీమారం మండల కేంద్రానికి సబ్ స్టేషన్ మంజూరు

మేడిపల్లి: భీమారం మండల కేంద్రానికి రూ.2.20 కోట్లతో 33/11 కేవీ నూతన సబ్ స్టేషన్ మంజూరు చేస్తూ సీఎండీ కే.వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి తెలిపారు. భీమారం మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల మూడు గ్రామాల ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న సబ్ స్టేషన్ మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు రైతులు, మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

నర్సరీల్లో విరివిగా మొక్కలు పెంచాలి



నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న రఘువరన్

కోరుట్లరూరల్: గ్రామాల్లోని నర్సరీల్లో రాబోయే సంవత్సరంలో డిమాండ్‌కు అనుగుణంగా మొక్కలు పెంచాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్ అన్నారు. కోరుట్ల మండలంలోని కల్లూర్, పైడిమడుగు, అయిలాపూర్ గ్రామాల్లో నర్సరీలను శనివారం సందర్శించారు. మొక్కలు ఎండి పోకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పొలంబాటలో వేసిన రహదారులను పరిశీలించారు. ఈజీఎస్ చేపట్టే పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనుల్లో అలసత్వం తగదని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో ఓదెల రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, ఏపీఓ మమత, టీఏలు దారాసింగ్, స్రవంతి, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

జేసీని కలిసిన టీఎన్జీవోస్



అభినందనలు తెలుపుతున్న టీఎన్జీవో నాయకులు

జగిత్యాల:టీఎన్జీవో నాయకులు శనివారం అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచాలని జేసీ కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, సాహెబ్‌బాబు, రవిచంద్ర, రాజేందర్, రవికుమార్, రాజేశ్ పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పని చేస్తా



మాట్లాడుతున్న బీఎన్ రావు

కోరుట్ల: తనకు ఎమ్మెల్సీగా అవకాశమిస్తే నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించటమే మొదటి ప్రాధాన్యంగా పని చేస్తానని డాక్టర్ బీఎన్ రావు అన్నారు.పట్టణంలోని ఐబీ గెస్ట్ హౌస్‌లో శనివారం మాట్లాడారు. రాబోయే కరీంనగర్, నిజామాబాద్,మెదక్,ఖమ్మం పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉంటానని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్సీగా గెలిస్తే ముఖ్యంగా ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ పరిధిలో 6 లక్షల ఉద్యోగాల బర్తీకి కృషి చేస్తానని, అందులో 2 లక్షలు ప్రభుత్వ ఉద్యోగాలు, 4 లక్షల ప్రైవేట్ ఉద్యోగాల బర్తీయే లక్ష్యంగా పని చేస్తానని పేర్కొన్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 10 స్మార్ట్ సిటీలు ఏర్పాటు చేయాలని, విద్యా, ఆరోగ్యం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్రొడక్షన్,మ్యానుఫ్యాక్షర్ రంగాలకు ప్రభుత్వాలు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ అనూప్ రావు, కథలాపూర్ మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, సీనియర్ డాక్టర్ అల్లె మహాదేవ్, డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

కోరుట్ల: పట్టణ శివారులోని సాయిబాబా ఆలయ హుండీ లెక్కింపు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 2.69 లక్షల నగదు సమకూరిందని, మిశ్రమ బంగారం, వెండి లభించినప్పటికీ కంసాలి లేనందున తిరిగి హుండీలోనే వేశామని దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి ఎం రాజమౌళి తెలిపారు. కార్యక్రమంలో పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

రాయికల్: రాష్ట్ర స్థాయి సాంఘీక శాస్త్ర ప్రతిభ పోటీలకు రాయికల్ మండలం భూపతిపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన బొడ్డుపల్లి రక్షిత ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటరమణి శనివారం తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో బొడ్డుపల్లి రక్షిత జిల్లాస్థాయిలో ప్రథమస్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థిని సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయుడు వంశీధర్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పెగడపల్లి: జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టులో పెగడపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని మాసూరి మృణాళిత ప్రతిభ చాటింది. జిల్లా కేంద్రంలో నిర్వహించిని ప్రతిభా పోటీల్లో మృణాళిత పాల్గొని మండల స్థాయిలో మొదటి బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మృణాళితను ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, సాంఘిక శాస్త్ర టీచర్ సంధ్యారాణి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కథలాపూర్: జగిత్యాలలో శనివారం నిర్వహించిన సోషల్ సబ్జెక్ట్ టాలెంట్ టెస్ట్‌లో కథలాపూర్ మండలం భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని హేమశ్రీ ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం రాజయ్య, సబ్జెక్ట్ టీచర్ నరేశ్ తెలిపారు.

జర్నలిస్టులు సభ్యత్వం తీసుకోవాలి



సభ్యత్వం ఇస్తున్న సురేంద్రకుమార్

జగిత్యాలటౌన్: అర్హులైన జర్నలిస్టులు సభ్యత్వ నమోదు చేసుకోవాలని టీయూడబ్ల్యూ ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.సురేంద్రకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా సురేంద్రకుమార్ మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరూ విధిగా తమ సభ్యత్వ నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస్‌రావు, కార్యదర్శి ప్రదీప్‌కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగుల గోపాలచారి, అనుబంధ సంఘాల సభ్యులు టీవీ సూర్యం, కొత్తూరి మహేష్, కందుకూరి శశిధర్, ఆదిల్, అంజయ్య, శ్రీధర్ రావు, రాజేశ్‌గౌడ్, హైదర్, హరికృష్ణ, వంశీ, హరీశ్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

అల్లీపూర్ మండలంలో ఆరు రెవెన్యూ గ్రామాలు

రాయికల్: అల్లీపూర్ నూతనంగా ఏర్పడే మండలంలో ఆరు రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదికను పంపించారు. దీనిలో భాగంగా ఆలూరు రెవెన్యూ పరిధిలో ఆలూరు, రాజనగర్ పంచాయతీలు, ఉప్పుమడుగు రెవెన్యూ పరిధిలో ఉప్పుమడుగు, అల్లీపూర్ రెవెన్యూ పరిధిలో అల్లీపూర్, అయోధ్య, కుర్మపల్లి, సింగరావుపేట, శ్రీరాంనగర్, కిష్టంపేట రెవెన్యూ పరిధిలో కిష్టంపేట, సారంగాపూర్ మండలం నాగునూర్ రెవెన్యూ పరిధిలో నాగునూర్, లచ్చక్కపేట రెవెన్యూ పరిధిలో లచ్చక్కపేట గ్రామాలను ఎంపిక చేసి రెవెన్యూ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిసింది. అల్లీపూర్ నూతన మండలంగా ఏర్పడితే మండలంలోని 9 గ్రామాలు, సారంగాపూర్ మండలం నుంచి 2 గ్రామాలు మొత్తం 11 గ్రామాలను కలిపి నూతన మండలంగా ఏర్పాటయ్యే అవకాశం ఉంది.



కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామశివారులో నల్లచెరువు వద్దకు వెళ్లే రోడ్డులో వ్యవసాయ మోటార్ల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతున్నాయి. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు, సిబ్బందికి పలుమార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి విద్యుత్ తీగలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
బి.రఘుపతి, ట్రాన్స్‌కో ఏడీఈ, కోరుట్ల రూరల్, సెల్ నంబర్: 9989679675

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

తల్లిదండ్రుల కల నెరవేర్చిన వేళ



తండ్రితో శశికుమార్

మల్యాల: తల్లిదండ్రుల కలలను నెరవేర్చాడు తనయుడు. మల్యాల మండలం తాటిపల్లిలో నిరుపేద కుటుంబం బెజ్జంకి చిన్నదుర్గయ్య, గౌరవ్వ కుమారుడు శశికుమార్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. హైదరాబాద్‌లో జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్‌తో శిక్షణ పూర్తిచేసుకున్నాడు. కుమారుడిని చూసి తల్లిదండ్రులు ఆనందభాష్పాలతో కన్నీళ్లు పెట్టుకున్నారు.

సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని వినతి

రాయికల్: మండలంలోని రామాజీపేటలో వెల్మ సంక్షేమ సంఘ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని శనివారం వెల్మ సంక్షేమ మండలి సంఘం నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాగర్‌రావు, రామాజీపేట సంఘ అధ్యక్షుడు దుగ్యాల రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అభినందన

జగిత్యాల: ఖోఖో వరల్డ్‌కప్ ఇంటర్నేషనల్ టెక్నికల్ అఫిషియల్‌గా సారంగాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రవి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రాము అతడిని సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందరావు, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

మల్లాపూర్: మద్యానికి బానిసై మండలంలోని ముత్యంపేటకు చెందిన బండారి మోహన్(38) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మోహన్ భార్య కుటుంబ కలహాలతో కొంతకాలంగా దూరంగా ఉంటోంది. జీవితంపై విరక్తి చెంది ఉరేసుకున్నాడు. మోహన్ తమ్ముడు బండారి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కథలాపూర్: మండలంలోని దుంపేట గ్రామానికి చెందిన ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుల సంతోష్ పలువురి పేదలకు నిత్యావసర వస్తువులు, విద్యార్థులకు పరీక్ష సామగ్రి శనివారం పంపిణీ చేశారు. సంతోష్ తన పుట్టినరోజు సందర్భంగా గ్రామంలోని 5 గురు పేద కుటుంబాలకు 25 కిలోల బియ్యంతోపాటు నిత్యావసర వస్తువులు అందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 90 మంది విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్‌లు, స్కేళ్లు అందించారు. దాత సంతోష్‌ను స్థానిక యువకులు అభినందించారు.

యాదవ మహాసభ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శిగా మహేశ్

కథలాపూర్: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని దూలూర్ గ్రామానికి చెందిన కుంభం మహేశ్ యాదవ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన రాష్ట్ర సమావేశాల్లో నియామక పత్రం అందుకున్నారు. మహేశ్‌యాదవ్ గతంలో యాదవ మహాసభ మండల, జిల్లా కార్యవర్గాల్లో సేవలందించారు. విద్యార్థి సంఘాల్లో రాష్ట్రస్థాయి నాయకుడిగా పనిచేయడంతో జిల్లా ప్రధానకార్యదర్శిగా నియమించినట్లు సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

అలరించిన రంగవల్లులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని నవ్య బాలికల జూనియర్ కళాశాలలో సంక్రాంతి నేపథ్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ రంగులతో తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా ముగ్గులు వేశారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్, ఈశ్వర్‌కుమార్ పాల్గొన్నారు.

నోటుబుక్‌ల పంపిణీ

రాయికల్: మండలంలోని వీరాపూర్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమ వెంకటేశ్, జిల్లాల సతీశ్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్‌లు, మధ్యాహ్న భోజన కార్మికులు, పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మహబూబ్, మహిపాల్, నరేశ్, నవీన్, నర్సారెడ్డి, ఇస్మాయిల్, సర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

ధర్మపురి: ఆర్థిక పరిస్థితులు బాగా లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద గొల్లపెల్లి మంజుల కుటుంబానికి శనివారం శ్రీలక్ష్మీ నరసింహ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, రూ.2 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రంగు లక్ష్మీనరహరి, పప్పుల శ్రీనివాస్, రంగ హరినాథ్, కొరిడె కిరణ్, ప్రభాకర్ తదితరులున్నారు.

మొగిలిపేటలో సొసైటీ ఏర్పాటు చేయాలి

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటలో నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని వీడీసీ చైర్మన్ ఎండీ.మహబుబ్ ఖాన్, గ్రామస్తులు కోరారు. కలెక్టరేట్‌లో డీసీవో మనోజ్‌కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం మొగిలిపేటలో సొసైటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆత్మగౌరవ యాత్ర విజయవంతం చేయాలి

జగిత్యాల: ఈనెల 19న మానుకోటలో జరుగుతున్న ఉద్యమకారుల ఆత్మగౌరవ యాత్రను విజయవంతం చేయాలని జిల్లా చైర్మన్ జవ్వాజి శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మగౌరవం కోసం ఉద్యమకారులంతా ఐక్యంగా జేఏసీగా ఏర్పడి హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో పెట్టిన విధంగా 250 గజాల ఇంటి స్థలం, రూ.25 వేల పెన్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాచుపల్లి రెడ్డి, నాగుల రవి, సత్యంరావు, ప్రేమ్‌కుమార్, ఉమేందర్ పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కోరారు.